క్లుప్తంగా

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



కత్తిపూడిలోని భక్తాంజనేయ ఎరువుల షాప్‌ను తనిఖీ చేస్తున్న ఏఓ గాంధీ

శంఖవరం: మండలంలోని కత్తిపూడిలో భక్తాంజనేయ ఫెర్టిలైజర్స్ షాప్‌లో ఎరువుల అమ్మకాలు నిలిపివేసినట్లు మండల వ్యవసాయాధికారి పి.గాంధీ తెలిపారు. కత్తిపూడిలోని ఎరువుల షాపుల్లో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎరువుల స్టాకు, రికార్డులు తనిఖీ చేసి నిల్వల్లో తేడాలు ఉన్నట్టు గుర్తించారు. ఈ నేపథ్యంలో 14.525 టన్నుల ఎరువుల అమ్మకాలను తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు నిలిపివేయాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈఓ మౌళిప్రసాద్, వ్యవసాయ సహాయకుడు ప్రభాష్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో మహిళల పాత్ర కీలకం



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

గండేపల్లి: సమాజంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని సీనియర్ రెసిడెంట్ (ఓబీజీవై) కన్సల్టెంట్ సీహెచ్ సరోజిని అన్నారు. మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జరిగిన మహిళా దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఆరోగ్యం, సమానత్వం, సమాజంలో మహిళ పాత్ర తదితర అంశాలను వివరించారు. మహిళా సాధికారత పొందిన సమాజం అనే అంశంపై కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎంవీ హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, మహిళా సాధికారత సెల్ అధ్యక్షురాలు వి.శైలజ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీలు



గండేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న చీఫ్ కమిషనర్ రమాదేవి

గండేపల్లి: ప్రజల దరఖాస్తు చేసుకున్న అర్జీలను ఎందుకు పెండింగ్‌లో ఉంచారు, వాటిని ఇప్పటివరకూ ఎందుకు పరిష్కరించలేదని ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ డి.రమాదేవి గండేపల్లి రెవెన్యూ సిబ్బందిని ప్రశ్నించారు. గురువారం ఆమె గండేపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకూ జరిగిన రెవెన్యూ సదస్సులు, రీ-సర్వే, పీజీఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. పీజీఆర్ఎస్‌కు 137 దరఖాస్తులు రాగా వాటిలో కొన్ని పరిష్కారమయ్యాయి. మరికొన్ని రిజెక్ట్ కావడంతో వాటిని పరిశీలిస్తున్నట్టు తెలిపారు. అర్జీదారులకు ఆమె స్వయంగా ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గండేపల్లి, జగ్గంపేట తహసీల్దార్లు శ్రీనివాస్, రమేష్, ఆర్ఐ సురేష్, వీఆర్వో రాజ్‌కుమారి, సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్యతో సేవలు సులభతరం

గండేపల్లి: వ్యవసాయశాఖ ద్వారా అందించే సేవలను సులభతరం చేసేందుకే ప్రభుత్వం రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయిస్తోందని మండల ఏఓ సద్గురుమూర్తి తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రీ పేరిట రైతులను గుర్తించేందుకు వ్యవసాయ మంత్రిత్వశాఖ ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుందన్నారు. భూమి, ఇతర వివరాలను రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందికి తెలియజేస్తే రైతుల సమక్షంలోనే విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రతి రైతూ ఫార్మర్ రిజిస్ట్రీ చేయించాలి

ప్రత్తిపాడు: వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని, దీనిలో భాగంగా రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య (యూనిక్ ఐడీ) అందిస్తోందని జగ్గంపేట ఇన్‌చార్జి ఏడీఏ యింటి వీరగంగాధర్ తెలిపారు. ప్రభుత్వ పథకాలు, రాయితీలు పొందాలంటే సొంత భూమి గల ప్రతి రైతూ 14 అంకెల విశిష్ట సంఖ్య నమోదు (ఫార్మర్ రిజిస్ట్రీ) తప్పనిసరిగా చేయించుకోవాలని చెప్పారు. ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే పథకాలు, రాయితీలు, పెట్టుబడి, పంటల బీమా, పంటలకు కనీస మద్దతు ధర, పంట రుణాలు వర్తిస్తాయని చెప్పారు. రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని సూచించారు.

ఉచితం ముసుగులో పచ్చ దందా

- రెచ్చిపోతున్న ఇసుక, గ్రావెల్ మాఫియా
- ఇసుక ట్రాక్టర్‌కు రూ.500 వసూలు
- విపక్ష నేతల ట్రాక్టర్లపై కేసులు
- ప్రభుత్వ విధానంతో పంచాయతీల ఆదాయానికి గండి



గొంపకొండ నుంచి ట్రాక్టర్‌లో తరలిస్తున్న గ్రావెల్



ఇసుక తవ్వకాలతో కోతకు గురవుతున్న తాండవ తీరం

కోటనందూరు: ఉచిత ఇసుక పాలసీ ముసుగులో కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. ఇసుక, గ్రావెల్ మాఫియాను ప్రోత్సహిస్తూ తాండవ నది, కొండలను కొల్లగొట్టేస్తున్నారు. ఇసుక ట్రాక్టర్‌కు రూ.500, గ్రావెల్ వేయించుకునే వారి పరిస్థితిని బట్టి దందా చేస్తూ జేబులు నింపేసుకుంటున్నారు. ఉచిత ఇసుక పాలసీలో పంచాయతీలకు ప్రమేయం లేకపోవడంతో వాటికి ఒక్క పైసా ఆదాయం లేకుండా పోయింది. ఉచిత ఇసుక పాలసీ సక్రమంగా అమలు అవుతుందా? లేదా? అని పర్యవేక్షించాల్సిన అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడకపోగా కూటమి నేతలు, మాఫియాకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా తరలిస్తున్న ఇసుక, గ్రావెల్ ట్రాక్టర్ల వేగానికి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇసుక, గ్రావెల్ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

స్వపక్షంలో విపక్ష నేతలకూ..

ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని ప్రజల కోసం కాకుండా కేవలం అధికార పార్టీలో చక్రం తిప్పే నేతల కోసమే ప్రవేశపెట్టినట్లుంది. కూటమి అగ్ర నేతలు సూచించిన వారు మాత్రమే సజావుగా ఇసుక, గ్రావెల్ దందా చేసుకోగలుగుతున్నారు. ప్రతిపక్ష పార్టీకి చెందినవారి ట్రాక్టర్లు, స్వపక్షంలో తమకు నచ్చని విపక్ష నేతల ట్రాక్టర్లపై కక్ష కట్టి జులుం విదుల్చుతున్నారు. తమకు నచ్చని ట్రాక్టర్లపై కేసులు, అపరాధ రుసుం విధించేలా అధికారులపై కూటమి నేతలు ఒత్తిడి చేస్తున్నారు. ఈ దోపిడీపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

కొల్లగొట్టి.. కొండలకు గుండు కొట్టి..

మండలంలో అల్లిపూడి, కోటనందూరు, కేఓ అగ్రహారం, బొద్దవరం గ్రామాలతో పాటు తుని వరకూ తాండవనది విస్తరించి ఉంది. తాండవ నది పొడవునా అందుబాటులో ఉన్న అన్ని ప్రాంతాల నుంచి ఇసుకను తవ్వేస్తున్నారు. తవ్విన ఇసుకను ఎడ్లబండ్లతో నది నుంచి ఒడ్డుకు చేర్చి ట్రాక్టర్లపై లోడు చేసి దందా సాగిస్తున్నారు. మరోపక్క కోటనందూరులో గొంపకొండతో పాటు నాలుగైదు గ్రామాల్లో గ్రావెల్ కొండలున్నాయి. కొండలను ఎడాపెడా తవ్వేయడంతో ప్రమాదకరంగా మారుతున్నాయి.



తాండవ నది నుంచి తరలిస్తున్న ఇసుక

కోతకు గురై..

తాండవనదిలో ఇష్టారాజ్యంగా జరుపుతున్న ఇసుక తవ్వకాలతో నదీగమనం అస్తవ్యస్తంగా మారుతోందని రైతులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తుపానులు, వరదల సమయంలో నీటి ప్రవాహానికి పెను ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి కింద ఉన్న ఇసుకను సైతం తవ్వేస్తుండడంతో నదిఒడ్డు కోతకు గురై సమీపంలో ఉన్న జిరాయితీ భూములు సైతం నదిలో కలిసిపోతున్న దయనీయ పరిస్థితులు ఉన్నాయి.

> **40 సెంట్ల భూమి కోతకు గురైంది**
>
> నాకు తాండవనది గట్టును ఆనుకొని 1.7 ఎకరాల జిరాయితీ భూమి ఉంది. నా భూమిని ఆనుకొని నదిలో భారీగా ఇసుక తవ్వకాలు జరపడం వల్ల గట్టు కోతకు గురై 40 సెంట్ల భూమి నదీగర్భంలో కలిసిపోయింది. ప్రస్తుత పరిస్థితి కొనసాగితే మొత్తం భూమి నదిలో కలిసిపోయే ప్రమాదం ఉంది. ఇసుక తవ్వకాలు ఆపాలని స్థానిక, జిల్లాస్థాయి అధికారులకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదు. సమస్య పరిష్కారమయ్యే వరకూ పోరాటం చేస్తా.
>
> – రాజారావు, ఇసుకతవ్వకాల బాధితుడు, కోటనందూరు

వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడిగా చినబాబు



చినబాబును అభినందిస్తున్న మాజీ మంత్రి దాడిశెట్టి రాజా

కోటనందూరు: వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడిగా అల్లిపూడి గ్రామానికి చెందిన చింతకాయల చినబాబు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. బీసీ సామాజిక వర్గానికి చెందిన చినబాబుకు మండల అధ్యక్ష పదవి కేటాయించడం పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. మండల అధ్యక్షుడిగా ఎన్నికైన చినబాబును మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా, ఎంపీపీ లగుడు శ్రీనివాసు, పార్టీ సీనియర్ నాయకులు గొర్లి రామచంద్రరావు, లాలం బాబ్జీ, నల్లమిల్లి గోవిందు, వేముల రాజబాబు, వెలగా వెంకట కృష్ణాజీ, గరిసింగు దొరబాబు, సర్పంచులు, ఎంపీటీసీలు అభినందించారు. ఈ సందర్భంగా చినబాబు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

దాడిశెట్టి రాజాకు అభినందనలు



తునిలో దాడిశెట్టి రాజాకు అభినందనలు తెలుపుతున్న బత్తుల వీరబాబు, నాయకులు

తొండంగి: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీ మంత్రి దాడిశెట్టి రాజాకు మండలంలోని పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. పార్టీ తొండంగి మండలం కన్వీనర్ బత్తుల వీరబాబు, పలువురు నాయకులు గురువారం ప్రత్యేక వాహనాల్లో తునిలోని దాడిశెట్టి రాజా కార్యాలయానికి వెళ్లి అభినందనలు తెలిపారు. పార్టీ అధిష్టానం తనకు మండల కన్వీనర్ బాధ్యతలు అప్పగించడం పట్ల బత్తుల వీరబాబు రాజాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కూటమి నేతల అవినీతి పాలనను ఎండగట్టి వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు సమష్టిగా కృషి చేయాలని దాడిశెట్టి రాజా వారికి సూచించారు. అనంతరం పార్టీ మండల కన్వీనర్‌గా నియమితులైన వీరబాబును రాజా అభినందించి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో యనమల కృష్ణ, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, సీతాంపురం పెండ్యాల బాబి, ఎ.కొత్తపల్లికి చెందిన పార్టీ నాయకులు సాపిశెట్టి చిన్న, బెక్కం చంద్రగిరి, పేకేటి హరికృష్ణ, గోపాలపట్నం ఎంపీటీసీ గునిమానికల ఏసుబాబు, సర్పంచ్ కటకం శివ యడ్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



జగ్గంపేటలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.చెన్నారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు జగ్గంపేట ఫైర్ ఆఫీసర్ ఎస్.లక్ష్మణరావు అగ్ని ప్రమాదాలు జరిగే తీరు, తక్షణమే స్పందించి వాటిని ఎలా నివారించాలి, అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణనష్టం లేకుండా బాధితులను ఎలా కాపాడాలో వివరించారు. అనంతరం కాలేజీ ఆవరణలో ప్రయోగాత్మకంగా ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బాలరాజు, అధ్యాపక సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

రత్నగిరిపై శానిటరీ కిరికిరి

- రాష్ట్రంలో అన్ని ఆలయాలకు ఒకే టెండర్ పిలవాలని ప్రభుత్వ నిర్ణయం
- మార్చి నెల నుంచి తాము విధులు నిర్వహించలేమని కేఎల్‌టీఎస్ స్పష్టీకరణ

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో శానిటరీ విధులు నిర్వహిస్తున్న హైదరాబాద్‌కు చెందిన కేఎల్‌టీఎస్ సంస్థ వచ్చే నెల 1వ తేదీ నుంచి తాము ఆ విధులు నిర్వహించలేమని దేవస్థానానికి లేఖ సమర్పించింది. ఈ సంస్థ టెండర్ గడువు గత నవంబర్ ఐదో తేదీతో ముగిసింది. కాగా కొత్త టెండర్ దారుడు వచ్చే వరకూ పని చేయాలని దేవస్థానం కోరడంతో వారు పాత టెండర్ రేటుకు పని చేస్తున్నారు. కాగా తమకు ఆ రేటు గిట్టుబాటు కానందున తాము మార్చి నెల నుంచి పనిచేయలేమని తేల్చి చెప్పారు. ఈ సంస్థ 2022 నవంబర్ 5న టెండర్ ద్వారా నెలకు రూ.49 లక్షల (జీఎస్టీతో కలిపి)కు దేవస్థానంలో శానిటరీ, హౌస్ కీపింగ్ నిర్వహిస్తోంది.

కూటమి ప్రభుత్వ నిర్వాకంతో..

గతంలో ఏ దేవస్థానానికి ఆ దేవస్థానం శానిటరీ టెండర్ పిలిచి లోయెస్ట టెండర్ ఖరారు చేసేవారు. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని దేవస్థానాలకు కలిపి ఒకే శానిటరీ టెండర్ పిలుస్తామని చెప్పి దేవస్థానాల వారీగా టెండర్ పిలవకుండా నిలిపివేశారు. గత నవంబర్ 5న అన్నవరం దేవస్థానంలో ఈ టెండర్ ముగిసినా టెండర్లు పిలవలేదు. ప్రస్తుత కేఎల్‌టీఎస్ సంస్థనే కొనసాగిస్తున్నారు. అంతేకాకుండా కూటమి ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో సూపర్‌వైజర్లుగా ప్రస్తుతం పనిచేస్తున్న వారిని కాకుండా దీనిపై అవగాహన లేని కొత్తవారిని సూపర్‌వైజర్లుగా నియమిస్తున్నట్టు చెబుతున్నారు. దీని వలన దేవస్థానంలో శానిటరీ వ్యవస్థ దెబ్బతినే అవకాశం ఉంది.

కొత్త టెండర్ ఖరారయ్యే వరకూ పనిచేయాల్సిందే

అన్నవరం దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు గురువారం రాత్రి 'సాక్షి'తో మాట్లాడుతూ దేవస్థానంలో శానిటరీ టెండర్ ఖరారయ్యే వరకు కేఎల్‌టీఎస్ సంస్థ శానిటరీ విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని తెలిపారు. ఆ మేరకు టెండర్ షరతుల్లో ఉందని చెప్పారు.

అన్నవరం కాంట్రాక్టర్‌కు జరిమానా

- మొబైల్ డిపాజిట్ కౌంటర్‌లో అదనపు వసూలు
- రూ.20 వేలు చెల్లించాలని వినియోగదారుల కమిషన్ తీర్పు
- కాంట్రాక్టర్‌కు రూ.5 లక్షల భారీ వడ్డన

కాకినాడ లీగల్: అన్నవరం దేవస్థానంలోని సెల్‌ఫోన్ డిపాజిట్ కౌంటర్‌లో అదనపు వసూలు చేసినందుకు వినియోగదారుల కమిషన్ భారీ జరిమానా విధించింది. వివరాలలోకి వెళితే కాకినాడకు చెందిన న్యాయవాది లక్ష్మీనారాయణ గత ఏడాది నవంబర్ 3న అన్నవరంలో తన ఫోన్‌ను డిపాజిట్ కౌంటర్‌లో ఉంచారు. అందుకు ఆయన రూ.5 చెల్లించాల్సి ఉండగా కౌంటర్ సిబ్బంది ఆయన నుంచి రూ.10 తీసుకున్నారు. దీనిపై ఆయన అక్కడి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో కాకినాడ వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. తీర్పులో లక్ష్మీనారాయణకు అదనంగా వసూలు చేసిన రూ.5తో పాటు మానసిక ఒత్తిడికి గురి చేసినందుకు రూ.15 వేలు, కోర్టు ఖర్చులకు రూ.5 వేలు ఇవ్వాలని, అలాగే కాంట్రాక్టరు రూ.5 లక్షల జరిమానాను దేవస్థానానికి చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. కాకినాడ వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చెరుకూరి రఘుపతి వసంత్ కుమార్, సభ్యులు చెక్కా సుశీ, చాగంటి నాగేశ్వరరావు ఈ నెల 11వ తేదీన ఈ మేరకు తీర్పు చెప్పారు.

టీడీపీ గుండాలపై చర్యలు తీసుకోవాలి



రంగవల్లి నగర్‌లో నిరసన ప్రదర్శన చేస్తున్న రైతుకూలీ సంఘం నేతలు

జగ్గంపేట: ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేదలపై దాడి చేసి, వారి గుడిసెలను తగులబెట్టిన టీడీపీ గుండాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం జగ్గంపేట శివారు రంగవల్లి నగర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వీరాంజనేయులు మాట్లాడుతూ కర్నూల్ జిల్లా బి.తాండ్రపాడులో పేదలపై టీడీపీ గుండాలు దాడి చేసి, వారు నివాసం ఉంటున్న గుడిసెలు తగులబెట్టడం దారుణమన్నారు. దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పేదలపై టీడీపీ గుండాలు చెలరేగిపోతున్నారని, ఎక్కడికక్కడ ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. నిరాశ్రయులైన పేదలకు ప్రభుత్వం తక్షణమే ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, సంఘం నేతలు రామలింగేశ్వరరావు, డి.సురేష్, సోమరాజు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రత్తిపాడు: మండలంలోని ప్రత్తిపాడు, ఉత్తరకంచి విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జగ్గంపేట విద్యుత్‌శాఖ ఈఈ బి.వీరభద్రరావు తెలిపారు. ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు కూడా చేపడతామన్నారు. ప్రత్తిపాడు సబ్ స్టేషన్ పరిధిలోని ఏలూరు, టి.రాయవరం, ధర్మవరం, రాచపల్లి, ఒమ్మంగి గ్రామాల్లోనూ, ఉత్తరకంచి సబ్ స్టేషన్ పరిధిలోని పొదురుపాక, పాండవులపాలెం, బవురువాక, శరభవరం, గజ్జనపూడి, చింతలూరు, శాంతిఆశ్రమం, వెంకటనగరం, ఉద్దండ జగన్నాథపురం, వాకపల్లి, పోతులూరు, ఉత్తరకంచి, పెద్దిపాలెం, వేములపాలెం, చినశంకర్లపూడి, పెదశంకర్లపూడి, లంపకలోవ, గోకవరం, వంతాడ గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

తొండంగి: మండలంలోని అన్నవ్యపేట, ఏవీ నగరం, గోపాలపట్నం సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ వీరభద్రరావు గురువారం తెలిపారు. విద్యుత్ లైన్ల మార్పు కారణంగా తుని, తొండంగి, శంఖవరం మండలాల్లోని పలు గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విగ్రహ ప్రతిష్ఠ పూజలు ప్రారంభం



వేంకటేశ్వరస్వామి విగ్రహానికి పూజలు చేస్తున్న పండితులు

జగ్గంపేట: మండలంలోని ఇర్రిపాకలో ఈ నెల 17న శివకేశవుల విగ్రహాలు ప్రతిష్ఠించనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం నుంచి విగ్రహ ప్రతిష్ఠ పూజలు ప్రారంభించారు. తొలిరోజు పండితులు పాణింగపల్లి సత్యపవన్ కుమార్ ఆచార్యులు, కొత్ర వెంకట సూర్యకామేశ్వరశర్మ ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి విగ్రహానికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాసన, అకల్మష హోమం, నవగ్రహారాధన, యాగశాల వాస్తు శుద్ధి నిర్వహించారు. పరమశివుని విగ్రహానికి రుద్రాభిషేకం, చండీ హోమం, రుద్రహోమం, దేవతాహోమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ఆయన కుటుంబ సభ్యులు పూజల్లో పాల్గొన్నారు.

ఉపకార వేతనాల పంపిణీ

తొండంగి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2024లో టెన్త్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఒంటిమామిడి దివీస్ ల్యాబోరేటరీస్ ప్రతినిధులు గురువారం ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. దానవాయిపేట, ఒంటిమామిడి, తాటియాకులపాలెం గ్రామాలకు చెందిన విద్యార్థులు మైలపల్లి భవాని, మడికి మహాలక్ష్మి, కొమ్మోజు శ్రీనివాసరవి, అర్జిల్లి రమ్యలకు రూ.70 వేలు చెక్కులను దివీస్ ప్రతినిధి బి.వాసుబాబు అందజేశారు. కార్యక్రమంలో దివీస్ ప్రతినిధులు ఎస్.బాలకృష్ణ, కె.తేజ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న పాదుల తొలగింపు



కిర్లంపూడిలో ముళ్లచెట్లు, పాదులు తొలగించిన అనంతరం విద్యుత్ స్తంభం



'అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనం

సాక్షి ఇంపాక్ట్

కిర్లంపూడి: మండలంలోని కిర్లంపూడి, భూపాలపట్నం ప్రధాన రహదారులను ఆనుకొని ఉన్న విద్యుత్ స్తంభాలకు ముళ్ల చెట్లు, తీగపాదులు అల్లుకున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఇటీవల 'అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. విద్యుత్ శాఖ సిబ్బంది ఆయా విద్యుత్ స్తంభాలను అల్లుకున్న ముళ్లచెట్లు, తీగపాదులు తొలగించారు.

పంట మార్పిడితో రైతులకు మేలు



జగపతినగరంలో అపరాల పంటలను పరిశీలిస్తున్న అధికారులు

కిర్లంపూడి: పంట మార్పిడితో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీఏ) బీవీఎస్ హరి అన్నారు. జాతీయ ఆహార భద్రత మిషన్ పథకంలో భాగంగా గురువారం మండలంలోని జగపతినగరం, సింహాద్రిపురం గ్రామాల్లో రైతులకు అపరాల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఓ జోకా అమృత, ఏడీఏ పి.మాధవితో కలసి ఆయన మినుము పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఏటా ఒకే రకమైన పంటలను వేయకుండా పంట మార్పిడి చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతులకు 50 శాతం సబ్సిడీతో కలుపు, పురుగు మందులు అందజేస్తున్నట్టు తెలిపారు. వీఏఏలు రామకృష్ణ, సునీత పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూబీఐ డిప్యూటీ రీజినల్ హెడ్ నారాయణ

ప్రత్తిపాడు: సైబర్ నేరాల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) రీజినల్ కార్యాలయం డిప్యూటీ హెడ్ నారాయణ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం సాయంత్రం మండల మహిళా సమాఖ్య సభ్యులు, వీఓఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైక్రో ఫైనాన్స్ సంస్థల రుణాల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వచ్చి, ఓటీపీ కానీ, ఏటీఎం పాస్‌వర్డు కాని అడిగితే తెలియపరచరాదన్నారు. వాటిని గోప్యంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం 2024-25 ఆర్థిక సంవత్సరం ప్రగతిపై చర్చించారు. సమావేశంలో వెలుగు ఏపీఎం వై.వెంకట్, ప్రత్తిపాడు, ధర్మవరం యూబీఐ బ్యాంకు మేనేజర్లు సుజల్, చందన కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ లతాచార్యులు, సీపీలు టి.శ్రీనివాస్, వై.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రఘురామను బర్తరఫ్ చేయాలి

తుని: దళిత ఐపీఎస్‌లను, అంబేడ్కర్ భావజాలాన్ని శాసన సభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు కుల అహంకారంతో విమర్శిస్తున్నారని, ఆయనను తక్షణమే బర్తరఫ్ చేయాలని అంబేడ్కర్ ఇండియన్ మిషన్ (ఎయిమ్) జోనల్ ఇన్‌చార్జ్ కొల్లా బత్తుల దిలీప్ డిమాండ్ చేశారు. స్థానిక సిద్ధార్థ ఫంక్షన్ హాలులో ఎయిమ్ జిల్లా అధ్యక్షుడు జల్లు చినబాబు అధ్యక్షతన గురువారం జరిగిన దళిత జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబద్ధత కలిగిన ఐపీఎస్ అధికారి సునీల్‌కుమార్‌పై కూటమి ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని అన్నారు. బ్యాంకులకు వేల కోట్ల రూపాయల టోకరా పెట్టిన రఘురామ కృష్ణరాజుపై కేసులు వేయాలని డిమాండు చేశారు. ఆయనకు పదవి ఇచ్చింది ప్రజలను పాలించాలని తప్ప దళితులను వేధించాలని కాదని దిలీప్ అన్నారు.